మారువేషం ముప్పు!

అజీజ్

“మామయ్యా! నామాట విను. ఇప్పటికీ మించిపోలేదు ఇల్లు ఖాళీచేసేయ్. ఇక్కడ దెయ్యాలున్నాయ్.”

ఫెళ్ళున నవ్వాడు ప్రొఫెసర్ ప్రకాశరావు. “చూడబ్బాయ్! నేను మహాబలిపురంనించి వచ్చి, ప్రయోగశాల కోసం ఈ ఇల్లు కొనడానికి ప్రయత్నిస్తున్నప్పట్నించీ నువ్విలా హెచ్చరిస్తూనే వున్నావ్!

ఇల్లు కొనడంతోబాటు ఈరోజు గృహప్రవేశంకూడా జరిగిపోయింది. నా ప్రయోగాలకి సంబంధించిన సైంటిఫిక్ ఎక్విప్‌మెంట్సన్నీ లేబరేటరీలో సర్దటంకూడా జరిగిపోయింది.

ఐనా, ఈ లోకంలో దెయ్యాలుండటం ఏమిటి, నాన్సెన్స్! మద్రాసులో క్రిమినల్ లాయర్‌గా పేరుపడ్డ నువ్వే యిలా మాట్లాడుతోంటే, ఇహ చదువుకోని పామరుల సంగతేమిటో ఊహించలేకుండా వున్నాను!” అన్నాడు.

హృదయనాథ్ నిట్టూర్చాడు. అతని వాల్కనులు ప్రకాశరావుపక్కన కూర్చున్న ద్రాక్షవేణి వేపుమళ్ళాయి.

ద్రాక్షవేణి ప్రకాశరావు ఏకైక సంతానం. ఈమధ్యే ఎమ్మెస్సీ ఫస్టు డివిజన్‌లో పాసయింది. తనలాగే ఆమె కూడా గొప్ప సైంటిస్టుగా రూపొందాలని ప్రకాశరావు ఆకాంక్ష.

ఆయన స్వస్థలం మహాబలిపురం. ద్రాక్షవేణి మద్రాసులో సేవుండి ఎమ్మెస్సీ చేసింది. హృదయనాథ్, ప్రకాశరావుకి వేలువిడిచిన మేనల్లుడు.

మహాబలిపురంనించి మద్రాసుకు షిఫ్టు కావాలని మొదటినుంచి అనుకుంటున్న ప్రకాశరావు చిరకాల వాంఛ ఈనాడు ఈడేరింది. ఇప్పుడు ద్రాక్షవేణి యూనివర్సిటీ పట్టభద్రురాలయింది గనక, ఆమె సహాయ సహకారాలతో తన ప్రయోగాలు నిరాటంకంగా కొనసాగించవచ్చని ఆయన అభిప్రాయం!

ఆ వుద్దేశంతోనే, మద్రాసుకు మూడు మైళ్ళదూరంలో ఎలాంటి డిస్టర్బెన్సూ లేని ప్రదేశంలో ఒంటరిగా పాడుపడున్న ఈ భవనం కొనేసి, మరమ్మత్తులు చేయించి, ఈ రోజు గృహప్రవేశంకూడా చేశాడు.

హృదయనాథ్ ఇల్లు మద్రాసులోవుంది. అక్కడే అతను గత ఐదేళ్ళనుంచీ ప్రాక్టీసుచేస్తూ, రెండుచేతులా సంపాదిస్తున్నాడు.

"మామయ్యా! మీరన్నట్టు నేను చదువుకున్నవాణ్ని. లాయర్ని. నిజమే. అలాగే మీ ఆత్మీయుణ్ని, బంధువునీ కూడా. మీ క్షేమాన్ని కాంక్షించడం సహజమే కదా?

ఒక్క విషయం ఆలోచించండి మామయ్యా! ఈ మద్రాసు చుట్టుపక్కల ఇళ్ళకొరత యెంత తీవ్రంగా

వుంటుందో మీకు తెలిసిందేకదా? అలాంటిది నగరానికింత చేరువలో వున్న ఈ లంకంత భవనం ఇన్నేళ్ళుగా మనిషి ఛాయలేకుండా దేనికుంది? దీని జోలికి ఎవ్వరూ దేనికి రారు? కారణం వుండాలిగా?''

''ఔను డాడీ! నేనూ విన్నాను. నెగలేనిదే పొగ రాదుకదా? బావ చెప్పేది నిజమేనేమో!''

ప్రకాశరావు మొహంచిట్లిస్తూ కూతురువైపుచూసేడు. ''ఎమ్మెస్సీ పట్టభద్రురాలివైన నువ్వేనా యిలా మాట్లాడేది? సిగ్గుచేటు! మీ కాకమ్మ కబుర్లు నమ్మి భయపడటానికి నేనేం పసిపిల్లాడ్నికాను. ఈజుత్తు ఊరికేఎండలో పండలేదు!''

''మీకు మామీద నమ్మకం లేకుంటే, ఈ చుట్టు పక్కల గ్రామాల్లో యెవరినయినా అడిగి తెలుసుకోండి మామయ్యా!''

''ఎవరో్న అడిగి తెలుసుకోటానికి నాదగ్గర టైంలేదు. వాళ్ళంతా చవటలు, దద్దమ్మలు!''

''కనీసం మీ నమ్మకమైన నౌఖరు నరసయ్యనయినా అడగండి, ఏమంటాడో?''

ప్రకాశరావు పకపక నవ్వి—''మంచి వుదాహరణే ఇచ్చావ్! వాడు ముందే మీ మాయమాటల్లోపడి హడలి చస్తున్నాడు. వాణ్నడగట మేమిటి?

నన్ను మభ్య పెట్టడానికి నువ్వెందుకింత తాపత్రయ పడుతున్నావో నేనూహించనలే ననుకున్నావా...''

''డాడీ!''

''నువ్ నోర్ముయ్! నోరు మూసుకోడం యిష్టం లేకుంటే, వెళ్ళి నీగదిలో పడుకో!'' కసిరాడు ప్రకాశ

రావు కూతుర్ని.

ద్రాక్షవేణి ముహం ముడుముకుని, అక్కణ్నించి వెళ్ళిపోయింది.

"హృదయనాథ్! మీ యిద్దరి ప్రేమ గొడవ నాకు తెలీదనుకోకండి. ద్రాక్షవేణి మద్రాసులోవుండి చదువుకుంటున్నప్పుడే నీ పిచ్చిలో పడింది. నువ్వు బుద్ధిమంతుడివే. కావలసిన వాడివే. ఒప్పుకుంటాను.

కాని, నేను సైంటిస్టుని కాకుండా వుండివుంటే, నాకో కొడుకే వుండివుంటే, ద్రాక్షవేణిని నీ చేతుల్లో పెట్టి, నా చేతులు దులుపుకునేవాణ్నే! దురదృష్టవశాత్తూ నాకున్న ఒకేఒక ఆశాదీపం ఆ అమ్మాయి.

నేనా జవసత్వాలుడిగి, చరమదశలోవున్న ముసలాణ్ణి. నా తరవాత, నేను అసంపూర్తిగా వదలిపోయిన నా ప్రయోగశాల గతేంకాను? అవి సామాన్యమైన యెక్స్‌పెరిమెంట్సు కావే! వాటిని పూర్తిచేసి, లోకకళ్యాణానికి పాటుపడేదెవ్వరు?

అందుకే నాకూతురు పెళ్ళి, సంసారంకంటి తాత్కాలిక మోహ పాశాలవలోనయి, అనామకురాలిగా రాలిపోకుండా, తన మేధాశక్తితో యెన్నెన్నో నూతన విషయాలు కనిపెట్టి, చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోవాలని కోరుకుంటున్నాను.

ఆ వుద్దేశంతోనే ఈ నూతన లేబరేటరీ నిర్మించాను. నగరానికింత దూరంలో దేనికి కొన్నానో తెలుసా? అమ్మాయి నీ ప్రేమ పిచ్చికి దూరంగా వుండాలనే!"

"ప్రేమను మీరు పిచ్చికింద జమకడుతున్నారా మామయ్యా!"

"లేకుంటే మరేమిటి? నువ్వు దేన్నైతే ప్రేమ అంటు న్నావో అది కేవలం తాత్కాలిక భావోద్రేకం మాత్రమే! పిల్లకవులూ, పిచ్చి రచయితలూ తాత్కాలిక ప్రేరణ చుట్టూ సాలెగూడులాంటి రంగులవలలల్లి యువతీ యువకుల్ని ప్రలోభంలో పడేస్తున్నారు.

ఆ ఉద్రేకం కాస్తా చప్పబడ్డాక, ప్రేమా గీమా గాలి కెగిరి, కలతలూ కార్పణ్యాలూ ప్రారంభమవుతాయి. ద్రాక్షవేణిని నువ్వొక ప్రేయసిగానూ, భార్యగానూ, తల్లి గానూ మార్చగలవు. అంతేకదా? కాని నా బిడ్డ గొప్ప శాస్త్రవేత్త కావడానికి జన్మించింది!"

నిట్టూర్చాడు హృదయనాథ్. "మామయ్యా! మీరు నన్నపార్థం చేసుకుంటున్నారు. మిమ్మల్ని మభ్యపెట్టి ఈ ఇల్లు విడిపించాలని నేను ప్రయత్నించడం లేదు. కావల సిన వారు. కోరి ప్రాణాపాయం కొని తెచ్చుకుంటున్నా రనే ఆందోళనతో ఇంతగా ఆరాటపడుతున్నాను. ఈ ఇంట్లోవున్న దెయ్యాలు ఎంత ప్రమాదకరమైనవో తెలిస్తే మీరిలా మాట్లాడరు..."

ప్రకాశరావు గొల్లున నవ్వి—ప్రమాదకరమైనవా? ఐతే, నీ కాకమ్మ కబుర్లింకా మిగిలి వున్నాయన్నమాట. సరే, కానివ్వు. ఇంతకీ, ఈ ఇంట్లోవున్నవి ఆడదెయ్యాలా? మగదెయ్యాలా?"

"రెండే రెండు ఆడదెయ్యాలు!"

"వెరీ గుడ్! ఒకర్తిని వంటమనిషిగా, ఒకర్తిని పని మనిషిగా వాడుకుంటాను."

ఆయన ఎగతాళి మాటలు ఆ దెయ్యాలెక్కడ వింటు న్నాయో అన్నట్టు చుట్టూ పరికించి చూసాడు హృదయ నాథ్.

"మామయ్యా! ఊడిగం చేయించుకోడానికి వాళ్ళు మామూలు మనుషులు కాదు. రాజకుమార్తెలు!"

పకపక నవ్వాడు ప్రకాశరావు. "రాజుల కాలంపోయి చాలా రోజులైంది. గనక, ఇప్పుడా దెయ్యాలుకూడా పోయుంటాయి."

"అవింకా పోలేదు మామయ్యా! ఇక్కడే వుండి ప్రతీకారం తీర్చుకుంటున్నాయి!"

"ప్రతీకారమా? ఎందుకో?"

"పదిహేడవ శతాబ్దంలో ఈ చుట్టుపక్కల చిన్న సంస్థానం వుండేదిట. ఆ రాజుకు అపురూప సౌందర్యవతులైన ఇద్దరు కుమార్తెలుండేవారుట..."

"అలాగా! ఐతే వాళ్ళని తప్పకుండా ఒకసారి చూసి తీరాలి!"

"...ఆ రాకుమార్తెలు ఈ భవనంలోనే నివసించేవారుట. ఒకసారి శత్రుసైనికులు ఈ సంస్థానంమీద దండెత్తి, విజయం సాధించి, రాజధానిని కొల్లగొడుతూ ఈ భవనంలో ప్రవేశించారుట.

ఆ రాకుమార్తెలు కనిపించగానే వాళ్ళ మతులుపోయి పశువులకన్న హీనంగా, కిరాతకంగా వాళ్ళను చెరిచేరుట. ఆ పాశవిక చర్యలోనే వాళ్ళు ప్రాణాలు కోల్పోయి, ప్రేతాలుగా మారి, ఆ నాటినించీ, ఈ నాటివరకూ ఈ భవనంలో అడుగెట్టిన ప్రతి మనిషిపై ప్రతీకారం తీర్చుకుంటున్నాయిట!"

"పాపం! వాళ్ళది చాలా విషాదగాథే మరి! నేను యువకుణ్ణికాను. పండు ముసలాణ్ణి. వాళ్ళు నన్నేం చెయ్యలేరు. నువ్వు నిశ్చింతగా వుండు."

"ఈ నమ్మకంతోనే ఇదివరకు చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. అందులో ఒకతను కాకతాళీయంగా కొద్దిరోజులపాటు బ్రతగ్గలిగాడు. నేనతన్ని చూశాను కూడా!"

ప్రకాశరావు చుట్ట వెలిగించుకుని "అతనేమన్నాడేమిటి?" అడిగాడు నిర్లక్ష్యంగా.

"ఆ దెయ్యాలు రాత్రిపూటే తమ చర్య ప్రారంభిస్తాయట. నిదరబోతున్న వ్యక్తి అర్ధరాత్రి హఠాత్తుగా కళ్లు తెరుస్తాడుట. మరుక్షణం అతని మాట పడిపోతుందిట. ఎంత అరవడానికి ప్రయత్నించినా నోట్లోంచి అరుపు ఇవతలికి రాదుట.

తరవాత ఏదో అజ్ఞాత శక్తి ఆ వ్యక్తిని మంచంమీంచి ఎత్తి కింద పడేసిందిట. విచిత్రమేమిటంటే, అతను కాళ్ల మీద కాక, చేతులమీద తలకిందులుగా లేచి నిల్చుని, ఇల్లంతా తిరగడం ప్రారంభించాడుట.

అలా తిరిగి తిరిగి అలిసిపోయి, చివరికి తన చేతులతోనే తన గొంతు నులుముకోడం ప్రారంభించాడుట. అలా నులుముకుంటూ ప్రాణాలు పోగొట్టుకోవలసిన వాడు, అదృష్టవశాత్తూ మూర్ఛపోయాడు.

మళ్ళీ కళ్ళు తెరిచి చూస్తే, మంచంమీద దుప్పటితో సీలింగ్ ఫాన్‌కు కట్టేయబడి, తలకిందులుగా వేళ్లాడుతున్నాడుట. అంతేకాదు. రాత్రి అతను పడుకున్న మంచం, కుర్చీలూ, టేబిళ్ళూ, ఇంట్లోని ప్రతి సామానూ తలకిందులుగా వున్నాయిట.

వెంటనే అతన్ని హాస్పిటల్లో చేర్చారు. కాకతాళీయంగా నేనూ అవే రోజుల్లో అక్కడ అడ్మిటయి

వున్నాను. అప్పుడు చూశానతన్ని. మూడు రోజుల తరవాత అతను మరణించాడు!''

''చా.చా! నా కిప్పుడప్పుడే వాళ్ళలా చావాలనే వుద్దేశం లేదు. అంతేకాదు. చేతులమీద తలకిందులుగా నడిచే అలవాటూ నాకు లేదు. కనక, ఆ దెయ్యాల ఎక్స్పెరిమెంట్ నామీద పనికిరాదు.

ఐనవాడివి గనక, ఏదో మా క్షేమంకోరి చెయ్యవలసిన ప్రయత్నాలన్నీ చేశావ్. థాంక్స్. ఇహ మా మానాన మమ్మల్ని వదిలి ఇంటికెళ్ళు. ఇప్పటికే రాత్రి బాగా పొద్దుపోయింది. అవతల వాతావరణంకూడా బాగులేదు'' అన్నాడు ప్రకాశరావు పూర్తయిన చుట్టని ఏష్ట్రేలో నొక్కుతూ.

నిట్టూరుస్తూ లేచి నిల్చున్నాడు హృదయనాథ్. ''సరే, మీ ఇష్టం! వస్తాను. గుడ్ నైట్.'' అన్నాడు వెనుదిరుగుతూ.

అడుగులో అడుగు వేసుకుంటూ నీరసంగా ఇవతలికి వచ్చాడు హృదయనాథ్.

బైట చీకటి! ఆకాశంనిండా దట్టమైన కారు మేఘాలు కమ్ముకు వున్నాయి. ఆగి ఆగి ఉరుములూ, మెరుపులూ తమ ప్రత్యేకతను చూపిస్తున్నాయి. కాసేపట్లో పెద్ద వర్షం వచ్చేట్టుంది.

వడివడిగా అడుగులు వేస్తూ కాంపౌండ్ గేటువైపు నడిచాడు.

గేటుముందు ఆగివుంది అతని కారు. గేటుదాటి కారు దగ్గరికెళ్ళాడు. అదే క్షణంలో తళుక్కుమంది మెరుపు.

ఆ లిప్తపాటు వెలుగులో కారు దగ్గర ఏదో ఆకారం

నిల్చున్నట్టు కనిపించి అదిరిపడ్డాడు.

"నేను బావా! ద్రాక్షవేణిని!!"

"నువ్వా ఇక్కడేం చేస్తున్నావ్?

"నీకోసమే ఎదురుచూస్తున్నాను బావా! నాన్నగారే మన్నారు? దారికొచ్చారా?"

హృదయనాథ్ పెదవి విరిచి, "ఆయన పట్టు ఉడుంపట్టులా వుంది. ఎంత మొత్తుకున్నా వినిపించుకోడం లేదు. మన ప్లానంతా తలకిందులైంది. ఈ ఇంటిమీదున్న ఆ భూత కల్పనలకీ, అవాకులూ చెవాకులూ చేర్చి, ఆయన ప్రయోగాలూ, చచ్చుబండలూ మాన్పించాలని మనం చేసిన ప్రయత్నాలన్నీ వమ్మయ్యాయి."

ఉస్సూరుమంది ద్రాక్షవేణి. ఆ తండ్రీ కూతుళ్ళ స్వభావాలు ఉత్తర దక్షిణ ధృవాలు. ద్రాక్షవేణికి లక్షణంగా పెళ్ళిచేసుకుని, పిల్లా పాపలతో సుఖంగా సంసారపక్ష జీవితం గడపాలనుంది.

"ప్రతి మనిషికీ కొన్ని ఆశలూ, ఆశయాలూ, దృక్పధాలూ వుంటాయి. నిజమే. తన ఆశయాలని ఒకరిమీద బలవంతంగా రుద్దే అధికారం ఆయనకులేదు. నీ వాయన కన్నకూతురివి. ఒప్పుకుంటాను, అంతమాత్రాన కోరికల్ని కూలదోసే హక్కు ఆయనకెక్కడిది?

"ఇప్పుడేం చేద్దామంటావు బావా?"

"చెయ్యాలి. ఏదో ఒకటి చేసి తీరాలి. లేకుంటే, మనం భగ్న ప్రేమికులమై జీవితాంతం కుళ్ళికుళ్ళి చావక తప్పదు. అందుకే నేనో నిర్ణయానికొచ్చాను."

"ఏమిటది?"

"అది చెప్పేది కాదు. చేసి చూపేది!" అంటూ

డోర్ తెరిచి, డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు హృదయ నాథ్.

మరుక్షణం కారు స్టార్టయి కదిలిపోయింది.

నిట్టూరుస్తూ గేటుమూసి, ఇంటివైపు నడిచింది ద్రాక్ష వేణి.

2

"ఢాం!"

"ఢాం!!"

రెండుసార్లు మారుమోగింది, పిస్తోలు పేలిన చప్పుడు. భవనమంతా!!!

మగత నిదరలో ఉన్న ద్రాక్షవేణి తృళ్ళిపడి లేచింది, దడదడలాడే గుండెలో, ఒక్క ఉదుటున మంచం దిగి తలుపువైపు పరిగెత్తింది.

తలుపు తెరిచి 'కవ్వు'మంది!

"నేనమ్మా నరసయ్యని! ఆ చప్పుళ్ళు విని నిదర లేచాను."

నౌఖర్ని చూడగానే ద్రాక్షవేణి ప్రాణం కుదుట పడింది.

"ఎక్కణ్ణించి వచ్చాయి ఆ చప్పుళ్ళు?" అడిగింది వణికే కంఠంతో.

"కింద పెయోగశాలలోంచమ్మా!"

"మైగాడ్!" అంటూ మెట్లవైపు పరిగెత్తింది ద్రాక్ష వేణి.

ఇద్దరూ గబగబ కిందికిచేరుకున్నారు. లేబరేటరీ తలుపు మూసుంది.

"డాడీ!..." అంటూ తలుపు తట్టబోయింది ద్రాక్ష వేణి.

చెయ్యి పడగానే 'కిర్రు' మంటూ తెరుచుకుంది తలుపు.

లోపల చీకటి!

మందుగుండు వాసన!!

గోడ తడిమి లైటు వెయ్యబోతూ గావుకేక పెట్టింది ద్రాక్షవేణి.

"ఏయ్, ఎవరు? ఆగు!" అంటూ చీకట్లో తెరిచిఉన్న కిటికీవైపు పరిగెత్తేడు నరసయ్య.

అదే క్షణంలో ఓ నల్లని ఆకారం కిటికీగుండా అవతలికి దూకింది.

నరసయ్య వెనకాముందు యోచించకుండా ఆవేశంలో తనూ కిటికీగుండా బైటికి దూకాడు.

బైట వర్షం పడుతుంది. నేలంతా బురదమయం! మసక చీకట్లో ఆ నల్లని ఆకారం రోడ్డువైపు పరిగెత్తుతూ కనిపించింది. క్షణం వృధా చెయ్యకుండా తనూ పరుగుతీశాడు నరసయ్య.

ద్రాక్షవేణి కూడా నరసయ్య వెనుక పరుగెత్తుకు రాసాగింది. క్షణ క్షణానికి ఆ ఆకారం వాళ్ళకు దగ్గరవుతోంది.

వాళ్ళ బారినుంచి తానిక తప్పించుకోలేననుకున్నాడేమో, రోడ్డువైపు పరిగెత్తుతున్నవాడల్లా చటుక్కున చింతతోపువైపు తిరిగి, వేగం హెచ్చించేడతను.

తనూ అటు తిరగబోయి, బురదనేలలో కాలుజారి పడిపోయేడు నరసయ్య. ద్రాక్షవేణి అతన్ని సమీపించింది.

"ఇక లాభంలేదు. పద, డాడీ సంగతి చూద్దాం!" అంది

అతని భుజం పట్టి లేపుతూ.

ఇద్దరూ తడబడే అడుగులతో ఇల్లు చేరుకున్నారు.

ప్రయోగశాలలో ప్రవేశించగానే నరసయ్య గోడ తడిమి లైటు వెలిగించాడు.

గదిలో కనిపించిన భీకర దృశ్యం చూసి, గావుకేక పెట్టింది ద్రాక్షవేణి.

లోపలి వస్తువులన్నీ తలకిందులుగా పడున్నాయి. టేబిలూ, కుర్చీలూ, టెలిఫోన్‌లతో సహా గోడకున్న పటాలు సైతం తిరగవేసి ఉన్నాయి.

అన్నిటికన్నా దిగ్భ్రాంతి కలిగించే విషయం, ప్రొఫెసర్ ప్రకాశరావు శరీరం, ఓ గోడవారగా తలకిందులుగా నిటారుగా నిల్చునుంది, శీర్షాసనం వేసినట్టు!

కళ్ళు యేదో భీభత్స దృశ్యం చూస్తున్నట్టు బైటికి ఉబికి వచ్చివున్నాయి. సరిగ్గా గుండెదగ్గర రెండు రంధ్రాలు. ఆ రంధ్రాల గుండా స్రవించి, నేలమీద మడుగుకట్టిన రక్తం!

ఆయన కుడిచేతిలో నిగనిగ మెరుస్తున్న రివాల్వర్. అదికూడా తిప్పి పట్టుకోబడింది ఆత్మహత్య భంగిమలో.

ఆయన ఆత్మహత్య చేసుకున్నాడా? ఎందుకు? ఏమిటీ విపరీత సంఘటన? దిగ్భ్రాంతినించి తేరుకోగానే, పసిపిల్లలా ఏడుస్తూ శవం దగ్గరికెళ్ళబోయింది ద్రాక్షవేణి.

నరసయ్య వెంటనే ఆమె భుజం పట్టి ఆపి, "వద్దమ్మా! త్వరగా పోలీసులకి ఫోన్ జెయ్యండి. వాళ్ళు వచ్చేవరకూ శవాన్ని అట్లాగే ఉండనివ్వండి!" అంటూ ఆమెని పొదివి పట్టుకుని హాల్లోకి తీసుకొచ్చాడు.

అప్పుడు గానీ ఆమెకు గుర్తురాలేదు తన తక్షణ కర్తవ్యం ఏమిటో.

గబగబ టెలిఫోన్ డైరెక్టరీ తిరగేసి, పోలీస్ హెడ్ క్వార్టర్స్ నెంబర్ కనుక్కొని, తక్షణం తెలియజేసింది వాళ్లకి, జరిగిన విషయం!

3

గంట లోపల ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డీ, సార్జంట్ డేవిడ్, నలుగురు కానిస్టేబుళ్లతో సహా, అంబులెన్స్ వచ్చి ఆగింది ఇంటిముందు.

డాక్టరూ, ఫోటోగ్రాఫరూ, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్సూ అందరూ బిలబిల లోనికి వచ్చారు.

ద్రాక్షవేణి వాళ్ళకి శవం ఉన్న గది చూపించి, మళ్ళీ ఆ దృశ్యం చూసే ధైర్యం లేక, హాల్లోనే కూర్చుండి పోయింది. నరసయ్య వెంట అందరూ ప్రయోగశాలలో కెళ్ళారు.

లోపల వాళ్ళ హడావుడీ, మాటలూ వినిపిస్తున్నాయామెకి.

పది నిమిషాల తరవాత ఇన్‌స్పెక్టర్ గబగబ ఆమెని సమీపించి, "మీరొకసారి లోపలికొస్తారా?" అడిగాడు ఆతృతగా.

ద్రాక్షవేణి తృళ్ళిపడి, "ఏం జరిగింది?" అంటూ లేచి నిల్చుంది.

"ఎలా చెప్పాలో అర్థంకావడంలేదు. నా సర్వీసులో యింతవరకూ యిలాంటి వైచిత్ర్యం చూళ్లేదు. రండి. ఒకసారి వచ్చి చూడండి!"

ద్రాక్షవేణి హడావుడిగా అతనితో లేబరేటరీలో అడుగుపెట్టి నిర్ఘాంతపోయింది!

ఎదురుగా కనిపిస్తున్న శవం తన తండ్రిదేనా అన్న మీమాంసతో చూస్తున్నాయి ఆమె కళ్ళు, రెప్ప వెయ్యకుండా!

"ఇన్‌స్పెక్టర్ గారూ! ఏమిటీ మాయ? నేనూ, నరసయ్యా చూసినప్పుడు..."

"రండి బైట కూర్చుందాం!" అంటూ ఆమెని హాల్లోకి తీసుకొచ్చాడు రాజారెడ్డి.

సోఫాలో చతికిలబడ్డాక చెప్పసాగాడు. "శవాన్ని మీరు ఏ రెండుగంటల క్రితమో చూసుంటారు. నేను పది నిమిషాల క్రితం చూశాను. అంతవరకూ మీ నాన్నగారి జుత్తు తెల్లగానే ఉంది.

తరవాత మేము చూస్తుండగానే కొద్దికొద్దిగా నల్లబడడం ప్రారంభించింది. మేమంతా ఆశ్చర్యంగా చూడసాగాం! పది నిమిషాల్లోనే జుత్తంతా పాతికేళ్ళ యువకుడిలా నల్లబడిపోయింది' ఇప్పుడు చెప్పండి ఈ రాత్రి మీ ఇంట్లో యేం జరిగింది?"

ద్రాక్షవేణి దాచకుండా, మొదటినించీ చివరివరకూ జరిగిందంతా అతనికి వివరించింది.

"ప్రొఫెసర్ గారు ఈమధ్య ఏదైనా ప్రముఖవిషయం మీద ప్రయోగాలు జరుపుతున్నారా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ అంతా విన్నాక.

"ఒకటి కాదు. రెండు ప్రయోగాలు! వాటి గురించి డాడీ నాకింకా పూర్తి వివరాలు చెప్పలేదు. మహాబలిపురంలో ఉన్నప్పుడే ఆయన ఆ ప్రయోగాలు ముగించేరుట. అవి అత్యంతనూతనమైన రెండు కొత్త కెమికల్స్‌కు సంబంధించినవని మాత్రం చెప్పేరు నాతో..." ద్రాక్షవేణి మాట ఇంకా పూర్తికాలేదు.

అంతలో సార్జంట్ డేవిడ్ హడావుడిగా అక్కడికి వచ్చి, "సార్! ఈ ఇంటికి ఫర్లాంగు దూరంలో ఉన్న

మెయిన్ రోడ్డుమీద ఓ ఫియట్ కారు ఆగి ఉంది. కార్లో ఎవ్వరూ లేరు'' అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ భృకుటి ముడిపడింది. "చూద్దాం రండి!" అంటూ లేచి బైటికి నడిచాడు.

ద్రాక్షవేణి కూడా వాళ్ళ ననుసరిస్తూ రోడ్డును సమీపించింది.

చీకట్లో రోడ్డుపక్క ఆగివుంది కారు. ఇన్‌స్పెక్టర్ ఆ కారుమీద టార్చి వెయ్యగానే ద్రాక్షవేణి అదిరిపడింది.

"ఇది ఎవ్వరిదో తెలుసా మీకు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఆమె వాలకం చూసి.

"తెలుసు! మా బావ హృదయనాథ్ కారు. ఎలా వచ్చిందిక్కడికి? బావ తొమ్మిది గంటలకే, నా కళ్ళ ముందే ఇక్కణ్ణించి వెళ్ళిపోయాడే!" అంది ద్రాక్షవేణి ఆశ్చర్యంగా.

అప్పుడు జ్ఞాపకం వచ్చాయి ఆమెకి, హృదయనాథ్ అన్న చివరి మాటలు. 'చెయ్యాలి! ఏదో ఒకటి చేసి తీరాలి. లేకుంటే మనం భగ్నప్రేమికులమై జీవితాంతం కుళ్ళి కుళ్ళి చావక తప్పదు. అందుకే, నేనో నిర్ణయాని కొచ్చాను...'

సాలోచనగా తలూపాడు రాజారెడ్డి. "కేసు చాలా తొందరగా తేలిపోయింది. దీని కంతటికీ మూలకారకుడు హృదయనాథ్ అన్నమాట! మీ నాన్నగార్ని, ఆయన పిస్తోలుతోనే చంపి, ఆ పని దెయ్యాలు చేసినట్టు నమ్మించడానికి, శవంతోబాటు వస్తువులన్నీ తలకిందులు చేశాడు.

నరసయ్యా, మీరూ లేబొరేటరీలో ప్రవేశించగానే, చీకట్లో కిటికీ దూకి పారిపోయాను. మనుషుల్ని చూసి, దెయ్యాలు పారిపోవనీ, అదృశ్యమౌతాయనీ పాపం అతనికి తెలీదు కాబోలు. మీరూ నరసయ్యా అతన్ని వెంబడించేసరికి, ఎక్కడ పట్టుబడతానో అని చింతతోపులోకి పారిపోయాడు.''

''బావ ఇంతపని చేశాడంటే, నేను నమ్మలేకుండా ఉన్నాను'' అంది నీరసంగా ద్రాక్షవేణి.

''రండి!'' అంటూ యింటివైపు దారి తీసాడు ఇన్‌స్పెక్టర్.

అప్పటికే ఫోటోగ్రాఫర్స్, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్స్ తమ తమ పనులు పూర్తిచేశారు. పరీక్ష నిమిత్తం ద్రాక్షవేణి వేలిముద్రలూ, నరసయ్య వేలిముద్రలూ, కార్లోని ముద్రలూ తీసుకోబడ్డాయి.

అప్పుడే మెరుపులా ఓ విషయం తట్టింది ఇన్‌స్పెక్టర్‌కు.

ద్రాక్షవేణిని సమీపించి, ''ఈమధ్య మీ నాన్నగారు కొత్త కెమికల్స్ గురించి పరిశోధన జరిపారన్నారు కదూ? ప్రతి సైంటిస్టూ తాను జరిపిన ప్రయోగాలగురించి యెప్పటికప్పుడు వివరాలు రాసి పెట్టుకుంటారు. ఆయన జరిపిన ఆ రెండు పరిశోధనల గురించీ కూడా వివరాలుండి తీరాలి. ఒకసారి వాటిని చూపిస్తారా నాకు...?'' అడిగాడు.

''తప్పకుండా! డాడీ తన ప్రయోగాలగురించి ఓ నల్లరంగు డైరీలో నోట్ చేసి పెట్టుకునేవారు. అది సైన్సు పరిభాష. సామాన్యుల కర్థంకాదు. లేబొరేటరీలోనో,

ఆయన గదిలోనో ఉండివుంటుంది ఆ డైరీ!"

అందరూ కలిసి లేబొరేటరీ, ప్రకాశరావు గదీ అణువణువూ శోధించారు. డైరీ జాడలేదు!

"నా అనుమానం నిజమే అయింది. హంతకుడు ఆ డైరీతో సహా పరారయ్యాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తలూపుతూ.

"బావ ఇంత ఘాతుకానికి పాల్పడ్డాడంటారా?" అంది ద్రాక్షవేణి అప్రతిభురాలై.

"అతని సంగతి మాకొదిలేయండి. మీకు నరసయ్యతోడున్నాడు. నిర్భయంగా ఉండండి. వీలైతే మళ్ళీ నేను వస్తాను..." అన్నాడు రాజారెడ్డి ఆమెకి ధైర్యం చెబుతూ.

ప్రొఫెసర్ శవం అంబులెన్స్‌లోకి చేర్చబడింది. రోడ్డు మీద ఆగివున్న ఫియెట్ కారుతో సహా, మద్రాసుకు తరలివెళ్ళింది పోలీస్ బలగం!

బితుకు బితుకుమనే ఆ బంగళాలో నరసయ్యా, ద్రాక్షవేణీ మిగిలిపోయారు శోకదేవతల్లా.

అప్పటికే రాత్రి రెండు గంటలు దాటింది!

4

సార్జంట్ డేవిడ్‌నీ, వేలిముద్రల నిపుణుణ్ణీ వెంటబెట్టుకుని హృదయనాథ్ యింటికెళ్ళాడు రాజారెడ్డి.

వాళ్ళ యిల్లు కనుక్కోవడం కష్టంకాలేదు. అయితే తలుపుకి తాళం వేళ్ళాడుతోంది.

మాస్టర్ కీతో దాన్ని తెరిచి లోనికెళ్ళారు. వేలిముద్రల నిపుణుడు చకచక ఇంట్లో ఉన్న వస్తువులమీద వేలిముద్రలు తీసుకున్నాడు.

సార్జంట్, ఇన్‌స్పెక్టర్ కలిసి యిల్లంతా సోదా చేశారు. ఏమీ దొరకలేదు.

ఇంటికి యథాతథంగా తాళంవేసి, హెడ్‌క్వార్టర్స్ చేరుకున్నారు.

గంటలోపల ఫింగర్ ప్రింట్స్ రిపోర్టు అందింది. లేబొరేటరీ కిటికీమీద లభించిన మూడు జతల వేలిముద్రల్లో రెండు ద్రాక్షవేణివీ, నరసయ్యవీ, మూడో జత హృదయనాథ్ వేనని స్పష్టమైంది!

అప్పుడు తట్టింది ఇన్‌స్పెక్టర్‌కు ఓ ఆలోచన "సార్జంట్! మనం హృదయనాథ్ చేతిలో మరో హత్య జరక్కుండా చూడవలసి ఉంది!" అన్నాడు గంభీరంగా.

"మరో హత్యా!"

"ఔను! అతనిప్పుడు నరసయ్యని హత్యచేసే అవకాశాలున్నాయి. దేనికో తెలుసా? ప్రొఫెసర్ హత్యానంతరం, నరసయ్య అతన్ని వెంబడించేడు. అతను హృదయనాథ్ వెంటబడకపోంటే, అతను శారెక్కి పారిపోయేవాడే!

ఆ కారువల్లేకదా మనకతని గురించి తెలిసింది? తన పథకం పారకుండా చేసిన నరసయ్యమీద అతను పగ తీర్చుకోవచ్చు. నరసయ్య సాక్ష్యాన్ని నిర్మూలించవచ్చు..."

ఇన్‌స్పెక్టర్ మాట పూర్తికాకముందే, బల్లమీది ఫోన్ మోగింది.

"ఎస్! ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి స్పీకింగ్!"

"నేను ద్రాక్షవేణిని మాట్లాడుతున్నానండీ!"

"ఏం జరిగింది? ఎందుకంత ఖంగారుపడుతున్నారు?"

"నరసయ్యానెవ్వరో ఎత్తుకుపోయారు. అతను రాత్రి నా గదిముందు తలుపుదగ్గర పడుకున్నాడు. తెలతెలవారుతుండగా బైటికొచ్చి చూస్తే, నరసయ్య పడుకున్నచోట రక్తపు మరకలు కనిపించాయి.

అంతేకాదు. ఓ ఉత్తరంకూడా పడుంది. మీరు తక్షణం బైలుదేరి రండి. నాకు చచ్చే భయంగా ఉంది క్కడ!" అవతల ద్రాక్షవేణి కంఠం వణుకుతోంది.

"ఇప్పుడే వస్తున్నాం!" అంటూ రిసీవర్ని దించి, సార్జంట్‌తో హుటాహుటిన బైలుదేరాడు ఇన్‌స్పెక్టర్.

అరగంటలో చేరుకున్నారక్కడికి!

ద్రాక్షవేణి ఇన్‌స్పెక్టర్‌కు ఆ ఉత్తరం చూపెట్టింది.

హాండ్ రైటింగ్ గుర్తుపట్టకుండా ఎడంచేత్తో గజిబిజిగా రాసినట్టుంది ఉత్తరం! మూడే మూడు పంక్తులున్నాయి.

"అతి తెలివికిపోతే, ఎటువంటి అనర్ధాలు దాపురిస్తాయో నరసయ్యద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. వాణ్ణి చిత్రవధచేసి చంపుతాను!"

ఉత్తరం చదివి, సాలోచనగా తలూపాడు. ఇన్‌స్పెక్టర్. "నిద్రపోతున్న మనిషిని తలమీద బాది,మూర్ఛపోగొట్టి తీసుకెళ్ళుంటాడు. ఇక మీరక్కడుండటం ప్రమాదం! హృదయనాథ్ ఇల్లు ఖాళీగా ఉంది. కేసు ముగిసేవరకు మీరక్కడుంటే ప్రమాదంలేదు. ఆ ఇంటిమీద ఇద్దరు కానిస్టేబుళ్ళ నిఘా యేర్పాటు చేస్తాను."

ద్రాక్షవేణికి తలూపింది.

ఆ భవనాని సీలువేసి బయలుదేరారు.

అరగంటలో మద్రాసు చేరుకుని, హృదయనాథ్ ఇంటిముందు జీప్ దిగారు. ఇంటి తలుపుముందు, మెట్ల మీద ఓ ముసలాడు కూర్చునున్నాడు, చుట్ట కాలుస్తూ.

"ఎవరు నువ్వు? ఇక్కడేం జేస్తున్నావ్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నేను -యర్ గారి దగ్గర పనిచేస్తున్నానండి. ఇంటికి తాళంవేసి ఆయనెక్కడికో వెళ్ళినట్టున్నారు. పొద్దుట్నించీ యెదురుచూస్తున్నానండి. ఇంకా రాలేదు."

"నీ పేరేమిటి?"

"నారాయణండి!"

ఇన్‌స్పెక్టర్ ద్రాక్షవేణివైపు తిరిగి, "మీకు నౌఖరు ప్రాబ్లమ్ తీరిపోయింది. ఇతను మీ అవసరాలు చూస్తాడు. నిశ్చింతగా ఉండండి" అంటూ ఆ ముసలాడికి చెప్పాడు. "ఈ అమ్మగారు యిక్కడే ఉంటారు. మీ అయ్యగారొచ్చేవరకూ యీమెని కనిపెట్టుకుని ఉండు! తెలిసిందా?"

నారాయణ తలూపాడు.

ఇన్‌స్పెక్టర్ మాస్టర్ కీతో తాళం తెరిచి, ద్రాక్షవేణిదగ్గర సెలవుతీసుకుని జీపెక్కాడు.

5

ఇన్‌స్పెక్టర్ బుర్ర తీవ్రంగా ఆలోచిస్తోంది. పోలీసుల బారినుంచి తప్పించుకు తిరిగే నేరస్తులకు ఆశ్రయం కల్పించి, వాళ్ళచేత చాకచక్యంతో తమ కార్యకలాపాలు జరిపించుకునే ఒక రహస్య సంస్థ పనిచేస్తోంది మద్రాసులో.

దాని పేరు 'సర్చిలైట్!'

ఆ సంస్థ సభ్యులకు పేర్లుండవు. నెంబర్లతో వ్యవహారిస్తారు. ఆ సంస్థను నడిపే లీడర్ని యితర్లే కాదు, అందులోని సభ్యులే ఇంతవరకూ చూడ్లేదు.

వాళ్ళకు తెలిసిందల్లా ఓ ఫోన్ నెంబర్. ఫోన్లోనే వాళ్లకు ఆదేశాలివ్వబడతాయి.

ఇన్ స్పెక్టర్ రాజా గెడ్డికూడా అందులో ఒక సభ్యుడు. మారువేషంలో, మారుపేరుతో చాకచక్యంగా అందులో సభ్యత్వం సంపాదించి, వారిలో ఒకడిగా మసులుతూ, పోలీసుల కన్నుగప్పి అక్కడ ఆశ్రయం పొందేవారి కూపీలూ, ఆ సంస్థ కార్యకలాపాలూ గమనిస్తూ, అవసరమైనప్పుడు ఇన్ స్పెక్టర్ రూపంలో మెరుపుదాడి జరిపి, కావలసినవాళ్లని పట్టుకుంటున్నాడు.

లాయర్ హృదయనాథ్నికూడా వాళ్ళు తమ ఆశ్రయంలోకి తీసుకున్నారా? ఈ ఆలోచన రాగానే హెడ్ క్వార్టర్స్నించి హుటాహుటిన యింటికి బయలుదేరాడు ఇన్ స్పెక్టర్.

ఇంట్లో తలుపులు మూసుకుని, బీరువాలోంచి మేకప్ బాక్స్ తీశాడు. అందులో రకరకాల విగ్గులూ, గెడ్డాలూ, మీసాలూ, ఇతర మేకప్ సామానూ ఉన్నాయి.

మిర్రర్ ముందు కూర్చుని చకచక మేకప్ ప్రారంభించాడు. గంటలోపల మనిషి పూర్తిగా మారిపోయాడు. భుజాలవరకు యెదిగిన హిప్పీజుత్తు. దట్టమైన కనుబొమలు. క్రిందికి వంగిన గుబురు మీసాలు. చెవి కిందా, ముక్కు మీద కత్తిగాట్లు!

ఇప్పుడతన్ని ఇన్ స్పెక్టర్ రాజా గెడ్డి అంటే ఎవ్వరూ నమ్మలేరు. బట్టలు మార్చుకుని, ఓ బ్రీఫ్ కేస్లో కావలసిన

సామాను సర్ది, యింటికి తాళం వేసి రోడ్డుమీదికి వచ్చాడు.

"ఎంగేసార్?" అడిగాడు డ్రైవర్.

"హోటల్ మయూర!"

టాక్సీ కదిలింది.

పావుగంటలో మయూర ముందు ఆగింది.

మీటర్ డబ్బులిచ్చి లోనికి నడిచాడు.

"హలో మిస్టర్ అరుణ్! ఇదేనా రావడం? చాలా రోజులు పట్టింది ఈసారి!" పలకరించాడు మేనేజర్ అతన్ని చూడగానే.

"పనిమీద సింగపూర్ వెళ్ళాను. ఇంతవరకూ అక్కడే వున్నాను. మీ అద్దె డబ్బులు ప్రతినెలా ముడుతున్నాయి కదా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ.

"అద్దె చెల్లించడంలో మీ వెనకే అందరూ! ఠంచనుగా ముడుతున్నాయి. థాంక్స్! కాఫీ తీసుకుంటారా?"

"నో థాంక్స్!" అంటూ బ్రీఫ్‌కేస్‌తో మెట్లవైపు నడిచాడు ఇన్‌స్పెక్టర్. రెండో అంతస్థులో ఉన్న రూం నెంబర్ 22 ముందాగాడు. జేబులోంచి తాళంచెవి తీసి, లాక్ తెరిచి లోనికి నడిచాడు.

తన సెక్రెటెట్ కార్యకలాపాలకోసం, గత ఏడాది నించీ అరుణ్ పేరుతో ఆ గది అద్దెకి తీసుకున్నాడు. గది అవసరం యెప్పుడోగానీ కలగదు. ఐనా, ప్రతినెలా అద్దె చెల్లిస్తున్నాడు.

తలుపు మూసి, టెలిఫోన్ వైపు నడిచాడు. ఆలోచిస్తూ ఓ నెంబర్ రింగ్ చేశాడు..

"హలో, ఎవరు మాట్లాడుతోంది?" అవతలినుంచి వినిపించింది ఓ పురుష కంఠం.

"నేను బాస్! మీ పాత సేవకుణ్ణి. నెంబర్ టూని...!"

"నువ్వా! ఇంత కాలం ఏమయ్యావ్? నీకోసం ఎంత వెతికించానో తెలుసా? హఠాత్తుగా యెక్కణ్ణించి ఊడి పడ్డావ్?"

"సారీ బాస్! మీతో చెప్పకుండా అనుకోకుండా సింగపూర్ వెళ్ళిపోయాను. ఇంత వరకూ అక్కడే ఉన్నాను."

"పెద్ద చెయ్యే కొట్టావన్నమాట! ఏమాత్రం దొరికిం దేమిటి?"

"ఏదో దొరకడం అటుంచి, ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి వచ్చింది. అతి కష్టంమీద బైటపడగలిగేను."

"ఇప్పుడైనా నీకు బుద్ధొచ్చిందనుకుంటాను. నేను చెప్పిన పనులు నెత్తినేసుకుంటే ఏమౌతుందో తెలిసిందిగా? ప్రస్తుతం నీకు డబ్బవసరం చాలా ఉందనుకుంటాను. సమయానికి వచ్చావ్. ఓ కొత్తపని రెడీగా వుంది నీకోసం! విజయవంతంగా ముగించావంటే, ఏభైవేలు ముడతాయి. ఏమంటావ్?"

"ఇప్పుడు నాకు పదిరూపాయలుకూడా ఎంతో విలువైనవి బాస్! చెప్పండి. ఏమిటాపని?"

"చెవులు రిక్కించి విను! అజంతా హోటల్లో, రూం నెంబర్ పదహారులో ఓ వ్యక్తి ఉన్నాడు. వాడి పేరు జోగేంధర్! మన సంస్థ మాజీ సభ్యుడే.

ఏడాది క్రితం వాణ్ణి విలువైన ఓ రహస్యం కనిపెట్ట డానికి నియమించాను. ఈమధ్యే వాడా రహస్యం చేజిక్కించుకోగలిగాడు. అప్పుడు తిరిగింది కథ అడ్డం!

ఆ రహస్యం చేజిక్కగానే వాడి మనసు మారి పోయింది. దాన్ని పొందాలనుకుంటే నాలుగులక్షలు చెల్లించవలసి ఉంటుందనీ, లేదా, దాన్ని ఇతర్లకి అమ్మేస్తాననీ ఫోన్ చేశాడు వాడు.

అప్పుడు నా రక్తం యెలా మరిగి వుంటుందో నీవే ఊహించుకోవాలి. విధిలేక అప్పటికి సరేనని, మరో సభ్యుడిద్వారా డబ్బు పంపి, వాడా రహస్యం యిచ్చిన మరుక్షణం మట్టుబెట్టి, డబ్బుతో తిరిగిరమ్మని పురమాయించాను.

వెళ్ళిన ఆ సభ్యుడు మళ్ళీ తిరిగి రాలేదు. కొంపదీసి నా పథకం తారుమారు కాలేదుకదా? జోగేంధరే అతన్ని చంపి, డబ్బు కాజెయ్యలేదు కదా?''

''అర్థమైంది బాస్! ఆ సందేహాలు తీర్చుకోడానికే నన్ను నియమిస్తున్నారన్నమాట. నిశ్చింతగా ఉండండి. నా శాయశక్తులా ప్రయత్నించి, ఆ రహస్యాన్ని సంపాదిస్తాను. అంతేకాదు, జోగేంధర్ని కూడా సఫాజేసి పారేస్తాను. ఇంతకీ, ఆ రహస్యం యేమిటో నాకు తెలియందే ఎలా కనుక్కోమంటారు దాన్ని?''

''అదొక నల్లరంగు డైరీలో నిక్షిప్తమై ఉంది. దాని కవరుమీద బంగారు రంగులో 'పి'అనే అక్షరం ముద్రించి ఉంటుంది!''

ఇన్స్పెక్టర్ ఆలోచలు తీవ్రరూపం దాల్చాయి. ప్రాతఃవేణి చెప్పిన డైరీ రంగుకూడా నలుపే! 'పి' అంటే ప్రకాశరావు కాదుకదా?

ఆ హత్యకీ, ఈ సంస్థకీ సంబంధం లేదుకదా? కాక తాళీయం అంటే ఇదే కాబోలు. జోగేంధర్ ఎవ్వరు? ఆ

డైరీ వాడిదగ్గరి కెలా వచ్చింది? హృదయనాథ్ ఏమయ్యాడు?

ఆలోచిస్తూ, "ఓ. కే, బాస్! వాణ్ణి చంపి, ఆ డైరీ, మీ డబ్బూ రెండు సంపాదిస్తాను. నా ఫోన్ కోసం ఎదురుచూడండి."

"విష్ యూ బెస్టాఫ్ లక్!"

రిసీవర్ దించి, బ్రీఫ్ కేస్ తెరిచాడు ఇన్స్పెక్టర్. మారు తాళాలు అందుకుని జేబులో వేసుకుంటూ బైటికి నడిచాడు.

6

హోటల్ అజంతాముందు టాక్సీదిగి, డ్రైవర్ కు డబ్బిచ్చేసి లోనికి నడిచాడు.

థర్డు ఫ్లోర్ లో రూం నెంబర్ 16 కనుక్కోడం కష్టం కాలేదు.

తలుపు మూసుంది. కాస్త పరీక్షగా చూసాక, లాక్ వేసున్నట్టు స్ఫురించింది.

అంటే, జోగేంధర్ గదిలో లేడన్నమాట. మంచిదే. వాడు తిరిగివచ్చాక మెరుపుదాడి చెయ్యొచ్చు. మాస్టర్ కీతో లాక్ తెరిచి గదిలో ప్రవేశించాడు. గదిలో సూది పడితే వినిపించే నిశ్శబ్దం!

తిరిగి తలుపుమూసి, లోపలినుంచి యథాతథంగా లాక్ వేశాడు. టేబిల్ మీద రెండుసూట్ కేసులున్నాయి. జోగేంధర్ వచ్చేలోగా ఒకసారి గదంతా వెతికి చూడాలి.

సూట్ కేసులు తెరిచి క్షుణ్ణంగా చెక్ చెయ్యసాగాడు. నిత్యావసర వస్తువులు తప్ప మరేం లేవందులో. రహస్య అరల్లాంటివికూడా లేవు. మంచం, పరుపూ, దిళ్ళూ, టేబిలూ,

కుర్చీలూ గదిలో ఉన్న సామానంతా గాలించాడు. ఏమీ కనిపించలేదు. ఇహ బాత్‌రూం ఒక్కటే మిగిలింది. తృప్తికోసం అదికూడా వెతకడం మంచిది.

బాత్‌రూం వైపు నడిచాడు. తలుపు మూసుంది. పిడి తిప్పి తోశాడు.

కిర్రుమంటూ తెరుచుకుంది. లోన అడుగు పెట్టి కొయ్యబారిపోయాడు.

వేరొకరైతే ఆ దృశ్యం చూసి, కవ్వుమనే వారే!

నేలమీద బోర్లా పడుంది శవం!!

ఫుల్‌సూటులో ఉన్న పురుషుడి శవం!!!

కణతలో పిస్తోలుగుండు చేసిన రంధ్రం కనిపిస్తోంది. చటుక్కున మోకాళ్ళమీద కూర్చుని, శవాన్ని వెల్లకిలా తిప్పాడు. అతను చనిపోయి చాలా సేపైనట్టుంది. శరీరం కర్రలా బిగుసుకుపోయింది.

ఇన్స్‌పెక్టర్ యింకా ఆ షాక్‌లోంచి తేరుకోకముందే బాత్‌రూం తలుపు దభీమంటూ మూసుకుంది వెనుక! పక్కలో పిడుగుపడ్డట్టు, అదిరిపడి వెనుదిరిగాడు. అదే క్షణంలో, అవతలి తలుపుకూడా మూసుకున్న చప్పుడు వినిపించింది!

ఎవ్వరు? లోగేంధరా? నిశ్శబ్దంగా లోనికి వచ్చి తనని చూడగానే తలుపులు మూసి పారిపోయాడా? ఇప్పుడు తనిక్కడుండటం తన ఉనికికే ప్రమాదం!

వాడు తనని ఈ హత్య గొడవలో ఇరికించడానికి, స్థానిక పోలీసులకు ఫోన్ కేసినా చెయ్యొచ్చు. అప్పుడు తన మారువేషం బైటపడే ప్రమాదముంది. శవాన్ని సోదా చేసి, ఎంత త్వరగా ఇక్కణ్ణించి జారుకుంటే అంత మంచిది.

గబగబ శవం దుస్తులు వెతకసాగాడు. కోటు లోపలి జేబులో వెడల్పాటి వస్తువేదో ఉన్నట్టు తగిలింది వేళ్ళలికి వెంటనే దాన్ని ఇతలికి లాగేడు.

అది డైరీ!

నలుపురంగు డైరీ!!

దానిమీద 'పి' అక్షరం చూడగానే రాజారెడ్డి ప్రాణం లేచి వచ్చింది. ఆతృతగా డైరీ పేజీలు తిరగేసి చూసాడు.

ఖాళీ! ఏమీ లేవు!!

డైరీలోంచి అనేక పేజీలు చింపేసినట్టుంది. అంటే, జోగేంధర్ అందులోని ముఖ్యమైన కాగితాలన్నీ చింపుకుని, బాస్ పంపిన ఈ మనిషిని చంపి, ఖాళీ డైరీ శవం జేబులో పడేశాడా?

ఆలోచిస్తూ బాత్‌రూం తలుపుని సమీపించాడు. అదృష్టవశాత్తూ బాత్‌రూం తలుపులకు డోర్ లాక్స్ గానీ, అవతల గడియలుగానీ వుండవుగనక, నిశ్చింతగా పిడి తిప్పి తలుపు తెరిచి గదిలో అడుగుపెట్టాడు.

అప్పుడు వినిపించింది, బయట పోలీసు వ్యాన్ సైరన్!...

అనుకున్నట్టే జోగేంధర్ పోలీసులకి ఫోన్ చేశాడన్న మాట. వెంటనే పారిపోవాలి.

మెరుపులా గది తలుపును సమీపించి, మాస్టర్ కీతో తాళం తెరిచి, వడవాలో అడుగుపెట్టాడు. అలోగా, పోలీసులు పైకి పరిగెత్తుకువస్తున్నట్టు మెట్లమీద బూట్ల శబ్దం మారుమోగసాగింది.

ఆ మెట్లు తప్ప మరోదారి లేదు హోటల్లోంచి బయట పడటానికి.

జేబులోంచి పిస్తోలు తీస్తూ, పక్కగదివైపు గెంతేడు. పిడి తిప్పి తలుపు తోసేడు. తెరుచుకుంది. పిస్తోలు రెడీగా పట్టుకుని లోన అడుగుపెట్టాడు.

డ్రెస్సింగ్ టేబిల్ ముందు నలభైయేళ్ళ స్త్రీ కూర్చుని మేకప్ చేసుకుంటోంది. తలుపు చప్పుడు విని, చటుక్కున వెనుదిరిగింది. చేతిలో పిస్తోలుతో తలుపుమూస్తున్న ఇన్స్పెక్టర్ని చూడగానే ఆమె కనుబొమలు ముడిపడ్డాయి.

“ఏం, పట్టపగలే దొంగతనానికొచ్చావా?” అడిగింది చాలా నింపాదిగా.

ఆమె నిశ్చలతకి నివ్వెరపోయాడు ఇన్స్పెక్టర్!

మరో ఆడదైతే, పరాయి మగాడలా గదిలోకి దూరగానే గావుకేకలు పెట్టి, నానా గోల చేసేది.

“షటప్! నేను చెప్పినట్టు విన్నావంటే నీకేం భయం లేదు. నేను దొంగని కాను!”

“దొరవా! భయపడుతున్నదెవరు? నువ్వా? నేనా?” అంది ఆమె చెంపలకి గులాబీ రంగు అద్దుకుంటూ.

“పరాచికాలకిది సమయం కాదు. గదిలో నువ్వొక్కర్తివే ఉన్నావా?” అడిగాడు ఇన్స్పెక్టర్ బాత్రూం వైపు చూస్తూ.

“కొద్ది నిమిషాల క్రితం వరకూ ఒక్కదాన్నే ఉన్నాను. ఇప్పుడు నువ్వొచ్చావుగా?”

“ఇంతక్రితమే నేనో హత్య చేశాను. ఇప్పుడు రెండో హత్య చెయ్యడం నాకు కష్టం కాదు. హంతకుల్ని రెండుసార్లు ఉరి తీయరు. తెలిసిందా?”

ఆమె ఏదో అనబోయింది. అదే క్షణంలో బైట పోలీ

సుల అడుగుల శబ్దం ఉధృతమయింది. బహుశా వాళ్ళు శవంవున్న గదిలో ప్రవేశించి ఉంటారు.

తరవాత, హంతకుడికోసం హోటల్లోని గదులన్నీ గాలిస్తారు.

ఆమె కూడా పోలీసుల రాక పసిగట్టి ఉంటుంది. "నువ్వింక తప్పించుకోలేవు. పోలీసులు నీకోసం గాలిస్తూ, కాసేపట్లో యిక్కడికి వచ్చేస్తారు!" అంది చాలా నింపాదిగా.

"అప్పుడు వాళ్ళకీ గదిలో రెండు శవాలు దొరుకుతాయి" అన్నాడు ఇన్ స్పెక్టర్.

రెండు శవాలా? ఎవరివి?"

"ఇంకెవరివి? మనిద్దరివి!"

"నువ్వు చావదలచుకుంటే చావడానికి నాకేం అభ్యంతరం లేదుగానీ, నే నిప్పుడప్పుడే చావదలచుకోలేదు!"

"ఐతే, బుద్ధిగా చెప్పినట్టు చెయ్! కాసేపు నువ్వు నా భార్యగా నటించాలి! నీ పేరేమిటి?"

ఆ ప్రశ్నతో ఆమె ముఖం జేవురించింది. "సెర్చ్ లైట్ సభ్యులు తమ పేర్లు బైట పెట్టకూడదని తెలీదా నీకు?" అంది గంభీరంగా.

"నువ్వు సెర్చ్‌లైట్ సభ్యురాలివా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ దిగ్భ్రాంతితో.

ఆమె తలూపి, "నీకేదైనా ప్రమాదం వాటిల్లితే ఆదుకోడానికి బాస్ పంపేడు నన్ను. ఇంతకీ నీపనేమైంది?" అడిగింది కుతూహలంగా.

ఇన్ స్పెక్టర్ పెదవి విరచి "ఈ గెంఘర్ మనకంటే మూడాకులు యెక్కువ చదివినట్టున్నాడు. బాస్ పంపిన మనిషిని చంపి, ఆ డైరీలో ఉన్న కాగితాలన్నీ చింపు

కుని పరారయ్యాడు. నేను వెంటనే బాస్‌కు రిపోర్టివ్వాలి!" అంటూ తలుపువైపు నడిచాడు.

7

మయూర హోటల్ చేసుకోగానే, తన గదిలో ప్రవేశించి, గబగబ టెలిఫోన్ వైపు నడిచాడు రాజారెడ్డి. ఆ సీక్రెట్ నెంబర్ రింగ్ చేసి, రిసీవర్ అందుకున్నాడు.

"ఎస్, స్పీకింగ్!..." బాస్ కంఠం వినిపించింది అవతల.

"నేను! నెంబర్ టూని బాస్!!"

"పని సక్సెస్ అయిందా?"

"క్షమించండి. జోగేంధర్ నన్ను బోల్తా కొట్టించి తప్పించుకున్నాడు..." అంటూ జరిగిన సంఘటన వివరించాడు ఇన్‌స్పెక్టర్.

"వాడు నా డబ్బుతోబాటు, మన సభ్యుణ్ణికూడా పొట్టనబెట్టుకున్నాడు. ఎట్టి పరిస్థితిలోనూ వాణ్ణి వదలకూడదు."

"ఎక్కడున్నాడో తెలిస్తేకదా ప్రతీకారం తీర్చుకోడానికి?"

అవతల నవ్వు—"వాడెక్కడున్నాడో నాకు తెలుసు. నీవున్న హోటల్లోనే, రెండో అంతస్తులో, పన్నెండో గదిలో ఉన్నాడు. వెంటనే ఆగు రంగంలోకి."

"ఇక్కడే ఉన్నాడా? వెరీ గుడ్" అంటూ రిసీవర్ దించి బైటికి నడిచాడు ఇన్స్పెక్టర్.

నిమిషంలో రెండో అంతస్తు చేరుకుని, రూం నెం 12 ముందు ఆగాడు. తలుపు మూసుంది. లాక్ వేసుంది.

యోగేంధర్ లోపల లేనట్టున్నాడు. ఈసారి తను మోస పోకూడదు. మారు తాళంతో లాక్ తెరిచి, రివాల్వర్ రెడీగా పట్టుకుని లోన అడుగుపెట్టాడు.

గదిలో నిశ్శబ్దం! తలుపు మూసి గబగబ గదంతా వెత కడం ప్రారంభించాడు. అలా వెదుకుతూ కిటికీదగ్గర కెళ్ళి అనుకోకుండా బైటికి చూశాడు. అక్కణ్ణించి హోటల్ ముందున్న రోడ్డూ, రోడ్డుమీద వచ్చేపోయే జనం స్పష్టంగా కనిపిస్తున్నారు.

ఆ జనంలో, ఫుట్ పాత్ మీద తల వంచుకుని హోటల్ వైపు వస్తున్న ఓ అరవైయేళ్ళ వృద్ధురాలిమీద దృష్టి పడగానే ఇన్ స్పెక్టర్ కళ్ళు పెద్దవయ్యాయి.

కారణం, ఆమె నెక్కడో చూసినట్టు స్ఫురించిందత నికి. అదే క్షణంలో ఆ ముసలామె తలెత్తి, క్షణంపాటు ఆ కిటికీవైపు చూసి తిరిగి తల దించుకుంది!

సందేహం లేదు. ఆ కళ్ళూ, ఆ చూపులూ తనకు బాగా జ్ఞాపకం!

ఎవ్వరామె? ఎక్కడ చూశాడు? గుర్తుచేసుకోడానికి తీవ్రప్రయత్నం చేస్తూ, ఇంకాస్త పరీక్షగా చూశాడు ఇన్ స్పెక్టర్.

అంతలో, ఆమె హోటల్ వైపు రావడానికి పేవ్ మెంట్ దిగి, రోడ్డుమీదికి వచ్చింది. అంతే!

ఇంకా ఆమె రోడ్ క్రాస్ చెయ్యకముందే, ఓ అంబా సిడర్ కారు రివ్వున దూసుకువచ్చి, ఆమెని గుద్దేసి, బాణంలా దూసుకుపోయింది!

రోడ్డుమీద హాహాకారాలు చెలరేగాయి! దారినపోయే జనం రోడ్డుమధ్య రక్తపుమడుగులో పడున్న ముసలామె

చుట్టూ ఈగల్లా మూగుతున్నారు...

ఊహించని ఆ హఠాత్సంఘటన ఇన్ స్పెక్టర్ని అప్రతిభుణ్ణి చేసింది. ఆ ఘటన కేవలం కాకతాళీయమా? లేక, అందులో ఏదైనా మర్మం ఇమిడివుందా?

ఆమె నెక్కడో చూసినట్లు తనకి స్ఫురించడం, ఆమె తలెత్తి సరిగ్గా ఈ కిటికీవైపే చూడటం, అదే క్షణంలో ఆ కారు కుద్దేయడం...

కిందికెళ్ళి చూస్తే ఏమైనా తెలుస్తుందేమో, అనుకుంటూ వెనుదిరిగాడు ఇన్ స్పెక్టర్.

“చేతులెత్తి అక్కడే నిల్చో! అంతకిమించి చిటికెన వేలు కదిపినా గుళ్ళతో గుండె జల్లెడ చేస్తాను జాగ్రత్త!” అన్న కంచు కంఠం విని, పక్కలో బాంబు పేలినట్టు అదిరిపడ్డాడు.

గదిలోకి యెలా వచ్చాడో, ఎప్పుడొచ్చాడో తెలీదు. అతని ముందు ఓ వ్యక్తి నిల్చునున్నాడు, పిస్తోలు గురిపెట్టి!

“నాగుపాముతో చెలగాటం యెంత ప్రమాదమో, బహుశా, నీకిప్పుడు తెలిసివచ్చిందనుకుంటాను. ఈ జోగేంధర్ని చంపడం అంత సామాన్యమైన విషయమనుకున్నావా?” అతని కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి.

ఇన్ స్పెక్టర్ రక్తం ఉరకలు వేసింది. “జోగేంధర్! నువ్వు బాస్ను మోసంచేసి బ్రతకడం కల్ల! బుద్ధిగా ఆ కాగితాలు నాకప్పగించి, బాస్ను క్షమాపణ కోరుకో” అన్నాడు తీక్షణంగా.

జోగేంధర్ విరగబడి నవ్వి—“బాస్ ఇప్పుడీ లోకంలో ఉంటేకదా, క్షమాపణ చెప్పుకోడానికి? ఆ

దుర్గతి పట్టకుండా మీ బాస్‌ను ఈ లోకంనించి కైలాసం పంపేశాను!'' అన్నాడు నవ్వుతూ.

"బాస్‌ను చంపేశావా? ఇంపాసిబుల్!''

"ఐదు నిమిషాల క్రితం రోడ్డుమీద చచ్చిన ముసల్ది ఎవరనుకున్నావ్? అదే, మీ బాస్! ఇంతకాలం మగ కంఠంతో మిమ్మల్నందర్నీ బుట్టలో వేస్తూ, తన కార్య కలాపాలు నిరాటంకంగా జరిపించుకుంది. అజంతా హోటల్లో నిన్ను పోలీసులబారినుంచి రక్షించింది కూడా ఆమే! మారు వేషాలు వెయ్యడంలోనూ, కంఠాలు మార్చడంలోనూ ఆమెని మించినవాడు లేడు!

నిన్నిక్కడికి పంపినట్లు పంపి, నీపై నిఘా వుంచటానికి, మారువేషంలో బైలుదేరింది. అటువంటి ఆడది సజీవంగా వుంటే, నా ప్రాణాలకి ప్రతిక్షణం ప్రమాదం గనక, కారుతో ఆ పిశాచిని పచ్చడిచేసి, పరలోకానికి పంపేశాను. ఆ కారు పక్కసందులో వుంది. నేనిక్కడున్నాను'' అన్నాడు లోగేంధర్ నవ్వుతూ.

"మైడియర్ ఇన్‌స్పెక్టర్! తెలివి నీ ఒక్కడి సొత్తే అనుకోక. ఎన్ని మారువేషాలు వేసినా, ఎన్ని పేర్లు మార్చుకున్నా, నువ్వు నా కళ్ళు గప్పలేవు. నీ నటనా జీవితం యిప్పుడు నా చేతిలో సమాప్తం కాబోతోంది.

చచ్చేముందు, ప్రొఫెసర్ ప్రకాశరావును చంపిన హంతకుణ్ని అరెస్ట్ చేయించి మరీ చావు. హంతకుడు హృదయనాథ్ యిప్పుడెక్కడున్నాడో నాకు తెలుసు. ఆ విధంగా పోతూ, పోతూ కర్తవ్యపారాయణత చూపించి పోయావన్న కీర్తి దక్కుతుంది నీకు!''

"ఎక్కడున్నాడతను?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఆత్రుతగా.

"నిక్షేపంగా తన యింట్లోనే వున్నాడు, నౌఖరు నారాయణ రూపంలో!"

నోరు తెరిచాడు ఇన్స్పెక్టర్.

"హృదయనాథ్ కూడా సెర్చ్‌లైట్ సంస్థ సభ్యుడే! నాయకురాలు ప్రకాశరావు కనుగొన్న కొత్త ఫార్ములాను తస్కరించడానికి నన్నూ, హృదయనాథ్‌నూ నియమించింది.

అంతేకాదు, దాన్ని తస్కరించినంత మాత్రాన సరిపోదనీ సృష్టించిన ప్రకాశరావుని కూడా చంపడం అవసరమనీ, అప్పుడే దానికి విలువ వుంటుందనీ ఆదేశించింది.

ప్రకాశరావు కనిపెట్టిన రెండు కెమికల్స్‌ని ఏకం చేసే ఒక హేర్ డయింగ్ మందు తయారవుతుంది. ఆ మందు ఒక్కసారి వాడితే చాలు, తెల్లజుత్తు శాశ్వతంగా నల్లబడుతుంది.

అటువంటి వినూతన మందును కొనడానికి ప్రపంచమంతా ఎగబడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. తర్వాత కోటానుకోట్లు పోగుచేసుకోవచ్చు. అదీ ఆ నాయకురాలి పథకం!

మొదటినించీ ప్రకాశరావుకూ, హృదయనాథ్‌కూ ఆయన కూతురు విషయంలో మనస్పర్థలున్నాయి. హృదయనాథ్ ఆయన్ని చంపడానికి ఒప్పుకోడంలో ఆ కారణం కూడా ఒకటి!

వాళ్ళిద్దరూ ఘర్షణపడ్డ రాత్రి, హృదయనాథ్ వెళ్ళిపోయాక, ప్రకాశరావు లేబొరేటరీలో కెళ్ళి, తలుపులు మూసుకుని, ఆ కెమికల్స్‌ని తన జుత్తుమీదే పరీక్షించుకున్నాడు.

అవింకా తన ప్రభావం చూపించకముందే, హృదయ

నాథ్ కిటికీగుండా లోనికిదూకి, ప్రకాశరావు పిస్తోలుతోనే ఆయన్ని షూట్ చేసి, ఆ పని దయ్యాలు చేసినట్లు వాతావరణం సృష్టించాడు. తరవాత ఫార్ములా, డైరీ చేజిక్కించుకుని పారిపోయేడు. ప్రోగ్రాం ప్రకారం దాన్ని నా కప్పగించాడు.

నా ద్వారా అది నాయకురాలికందాలి. ఐతే, అది నా చేతికి రాగానే నా మనసు మారిపోయింది. ఆ సంపత్తో తెగతెగింపులు చేసుకుని, ఆ ఫార్ములా ద్వారా లక్షలు ఆర్జించాలని నిశ్చయించాను. ఇప్పుడు నీ సందేహాలన్నీ తీరాయనుకుంటాను.

హృదయనాథ్ ను అరెస్ట్ చేయించాలనుకుంటే, అదుగో బల్లమీద టెలిఫోనుంది. వెంటనే మీ హెడ్ క్వార్టర్స్ కు ఫోన్ చేసి చెప్పు!'' అన్నాడు జోగేంధర్.

సాలోచనగా తలూపి, అడుగులో అడుగు వేసుకుంటూ ఫోన్ వైపు నడిచాడు ఇన్ స్పెక్టర్.

''జాగ్రత్త! ఆ విషయం తప్ప, నీ నోట్లోంచి మరో ముక్క యివతలికి వచ్చిందా, ఒక్క గుండు చాలు నీ నోరు శాశ్వతంగా మూతబడటానికి!'' హెచ్చరించాడు జోగేంధర్.

ఇన్ స్పెక్టర్ రిసీవర్ అందుకున్నాడు. తను ఫోన్ చేసిన మరుక్షణం జోగేంధర్ పిస్తోలు గర్జించడం ఖాయం!

రింగ్ చెయ్యడానికి డయల్ మీద చెయ్యి వెయ్య బోతూ, కన్నుమూసి తెరిచేలోగా, ఫోనెత్తి జోగేంధర్ మీదికి విసిరాడు. అది రాకెట్ లా దూసుకెళ్ళి జోగేంధర్ని గుద్దుకుంది.

అతనా షాక్ లోంచి యింకా తేరుకోకముందే, చిరుతలా ఎగిరి బూటుకాలితో ఈడ్చి డొక్కలో తన్నేడు ఇన్ స్పెక్టర్. నెప్పికి మెలికలు తిరుగుతూ కిందకూలేడు జోగేంధర్. బూటు మడమతో ఒక్క తన్నుతన్నేడు కణతమీద.

జోగేంధర్ చిన్నగా మూలిగి, మూర్ఛపోయాడు.

ఇదంతా జరగడానికి ఒకేఒక నిమిషం పట్టింది!

ఇన్ స్పెక్టర్ క్షణం వృధా చెయ్యకుండా, జోగేంధర్ దుస్తులు వెతకడం ప్రారంభించాడు. కోటు లోపలి జేబు లోంచి బైటపడింది ఓ బరువైన పర్సు!

ఆతృతగా తెరిచిచూసేడు దాన్ని.

కనిపించేయి కాగితాలు!

ఆ డైరీలోంచి చింపిన కాగితాలు!!

హెడ్ క్వార్టర్స్ కు ఫోన్ చేసి, జోగేంధర్ని తీసికెళ్ళ డానికి జీప్ తెప్పించాలి. కిందపడ్డ ఫోన్ వైపు చూసేడు. అక్కడక్కడా చితికి పాడైపోయింది. రిసెప్షన్ లోంచి చెయ్యాలి.

అనుకుంటూ కాగితాలూ, పర్సూ, జోగేంధర్ పిస్తోలూ జేబులో వేసుకుని, బైటికి నడిచాడు. తలుపులు మూసి, బైట గడియలాగి, మెట్లవైపు నడిచాడు.

రిసెప్షన్ లోంచి హెడ్ క్వార్టర్స్ కు ఫోన్ చేసి, ఐదు నిముషాల్లో పైకివచ్చాడు. గడియ వేసి, గదిలో అడుగు పెట్టి గతుక్కుమన్నాను.

జోగేంధర్ అదృశ్యం!

తెరిచి చిన్న కిటికీ వెక్కిరిస్తోంది ఇన్ స్పెక్టర్ని!!

మెరుపుగా అటు పరిగెత్తి, బైటికి తొంగిచూసేడు.

కిటికీ పక్కనే వుండటం నిజంగా లాభం! ఈ సెంటర్ పారిపోవడానికి అది సహకరించి వుంటుంది.

ఇహ అక్కడ చేసేదేమీ లేదు.

హోటల్లోంచి బైటపడి టాక్సీ ఎక్కాడు.

8

హృదయనాథ్ ఇంటిముందు టాక్సీ దిగగానే, గబగబ ఇంట్లోకి నడిచాడు ఇన్స్పెక్టర్.

సోఫాలో కూర్చున్న ద్రాక్షవేణికి టీ అందిస్తూ కనిపించాడు నౌఖరు నారాయణ.

ద్రాక్షవేణి ఇన్స్పెక్టర్ని చూడగానే, చిరునవ్వుతో ఆహ్వానించి — "మరో కప్పు టీ పట్రా!" అంది నారాయణతో.

రెండు నిముషాల తరవాత టీ కప్పు ట్రేలో పెట్టుకు వచ్చాడు నారాయణ.

ఇన్స్పెక్టర్ కప్పందుకుని, కొద్దిగా టీ సిప్ చేసి, "మిస్టర్ హృదయనాథ్! నటనతో బాటు నీకు పాకశాస్త్రంలోనూ మంచి ప్రావీణ్యం వున్నట్టుంది!" అన్నాడు నవ్వుతూ.

హృదయనాథ్ పేరు వినగానే ద్రాక్షవేణీ' నారాయణా ఉలిక్కిపడ్డారు!

"ఇన్స్పెక్టర్! ఏమిటి మీరంటోంది? నారాయణని పట్టుకుని హృదయనాథ్ అంటారేమిటి?" అంది ద్రాక్షవేణి నివ్వెరబోయి.

"మారువేషాలు మనుషుల్ని ఎంతగా మార్చివేస్తాయో ప్రత్యక్షంగా చూపిస్తాను. చూడండి!" అంటూ లేచి నారాయణ వైపు నడిచాడు ఇన్స్పెక్టర్.

అతను వేపాకులా వణుకుతూ వెనక్కి తగ్గసాగాడు.

ఇన్‌స్పెక్టర్ అవేమీ పట్టించుకోకుండా, అతని తల పాగా, తెల్లమీసాలూ, కనుబొమ్మలూ అన్నీ ఊడదీసి ద్రాక్షవేణి వైపు చూసేడు.

"నువ్వా, బావా!" అంది నిశ్చేష్టురాలై.

హృదయనాథ్ తల దించుకున్నాడు నీరసంగా.

"మిస్టర్ హృదయనాథ్! ప్రొఫెసర్ ప్రకాశరావు హత్యానేరం కింద నిన్ను అరెస్ట్ చేస్తున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గంభీరంగా.

"నేను మామయ్యని చంపలేదు ఇన్‌స్పెక్టర్! నా మాట నమ్మండి. ఆ రాత్రి వాళ్ళింటినించి తిరిగొచ్చాక, మామయ్యని ఎలాగైనా వాళ్ళింట్లో దెయ్యాలున్నాయని నమ్మించాలని, నల్లదుస్తులు వేసుకుని, మళ్ళీ వెళ్ళా నక్కడికి.

ప్రయోగశాల కిటికీ తెరిచివుంది. ఆయన అందులోనే వుంటారని కిటికీ దగ్గరకెళ్ళాను. లోపల కనిపించిన దృశ్యం నన్ను దిగ్భ్రాంతుణ్ని చేసింది.

గదిలోని సామానుతోబాటు ఆయన శరీరంకూడా ఓ గోడనానుకుని, తలకిందులుగా నిల్చునుంది. నేను వెనకా ముందూ యోచించకుండా, కిటికీలోంచి లోపలికి దూకాను.

సరిగ్గా అదే క్షణంలో, ఎవ్వరో ప్రయోగశాలవైపు వస్తున్నట్టు అడుగుల శబ్దం వినిపించింది. నేను ప్రమాదాన్ని పసిగట్టి, వెంటనే గదిలోని లైటార్పి, కిటికీవైపు పరిగెత్తాను.

అప్పుడే తలుపు తెరుచుకుని, నరసయ్యా, ద్రాక్షవేణీ లోనికి వచ్చారు. వాళ్ళని చూడగానే కిటికీ దూకి పారి

పోయాను'' అన్నాడు హృదయనాథ్ జీవం లేని కంఠంతో.

''హత్య చెయ్యాలనివాడివైతే, ఇలా మారువేషంలో దేనికి సంచరిస్తున్నావ్?''

''పరిస్థితులన్నీ నాకు విరుద్ధంగా మారినందుకు భయపడి, ఈ సాహసానికి పూనుకున్నాను.''

ఇన్‌స్పెక్టర్ తల విదలించి, ''నీ సంజాయిషీలు సంతృప్తికరంగా లేవు. ఏది ఏమైనా నువ్వు మా వెంట హెడ్ క్వార్టర్స్‌కు రాక తప్పదు'' అంటూ టీపాయ్‌మీది టెలిఫోన్ అందుకున్నాడు.

హెడ్ క్వార్టర్స్‌కు రింగ్ చేసి, వెంటనే జీపు తీసుకు రమ్మని చెప్పాడు సార్జంట్‌తో.

అరగంట తరవాత బైట జీప్ ఆగిన శబ్దం వినిపించింది. నెమ్మదిగా ఓ వ్యక్తిని పొదివి పట్టుకుని, ఇంట్లో ప్రవేశించాడు సార్జంట్ డేవిడ్.

ఆ వ్యక్తిని చూడగానే అందరూ అప్రతిభులయ్యారు.

''నరసయ్యా! నువ్వా...!'' అంది ద్రాక్షవేణి చేష్టలుడిగి.

ఒళ్ళంతా కట్లతో, పీక్కుపోయిన మొహంతో, జీవచ్ఛవంలా ఉన్నాడు నరసయ్య.

''ఇంతవరకూ యెక్కడున్నావ్? ఈ గాయాలేమిటి? ఎవరు కొట్టారు నిన్ను?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా.

''నరసయ్య హృదయనాథ్ వైపు చూపి, ''ఆ రాత్రి బాబుగారే నన్ను మూర్ఛ పోగొట్టి, ఎత్తుకుపోయి, ఓ యింట్లో బంధించేరు బాబూ! అక్కడ నన్ను చిత్ర

హింసలు పెట్టి, ఆకలిదప్పులతో చావనుని, తాళ్ళతో కట్టి పడేసి వెళ్ళిపోయేరు.

నానా అవస్థలు పడి, నా నోటి కడ్డంగా కట్టివున్న గుడ్డని పళ్ళతో కొరికేసి, గావుకేకలు పెట్టేను. ఇరుగు పొరుగు ఇళ్ళవాళ్ళు ఆ కేకలు విని, ఇంటి తాళం పగుల గొట్టి, నన్ను రక్షించేరు బాబూ!'' అన్నాడు చెమ్మగిల్లిన కళ్ళతో.

హృదయనాథ్ తెగించాడు. ''నీచుడా! నేను నిన్ను ఎత్తుకుపోయానా? చావబాదానా? ఎప్పుడు, ఎప్పుడు?'' అంటూ పిచ్చిగా నరసయ్య మీదికి లంఘించి, పిడికిళ్ళతో మొహంమీద బాదసాగాడు.

ఇన్ స్పెక్టర్ ఒక ఉదుటున లేచి, వాళ్ళను సమీపించే లోగా, ఎవ్వరూ ఊహించని ఓ చిత్రమైన సంఘటన జరిగింది!

హృదయనాథ్ పోట్లకు నరసయ్య మొహంమీది' నకిలీ ముక్కు ఊడి కిందపడింది! అంతేకాదు, మీసాలు కూడా కొద్దిగా ఊడి వేలాడసాగాయి!

''జోగేంధర్! నువ్వా!'' అన్నాడు ఇన్ స్పెక్టర్ నివ్వెరబోయి.

అతనితో బాటు మిగిలినవాళ్లు కూడా శిలాప్రతిమ లయ్యారు.

జోగేంధర్ మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు!

ఐపోయింది.